ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలి



ఎన్నికల సమయంలో భవిష్యత్తుకు భరోసా పేరుతో మహిళలకు ఆడబిడ్డ నిధి పథకం అమలు చేస్తామని చెప్పారు. ఎంతో ఆశ పడ్డాం. ప్రతినెల రూ.1500 వస్తాయి. ఇంటి ఖర్చులకు ఉపయోగపడుతుందని అనుకున్నాం. అయితే రెండు నెలలు దాటినా పథకం గురించి ఊసే ఎత్తడం లేదు. నిరాశగా ఉంది. ఈ పథకాన్ని వెంటనే అమలు చేస్తే మాలాంటి సామాన్య కుటుంబాలకు కొంత ఊరట లభిస్తుంది. – చాకలి లక్ష్మీదేవి, నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీ

ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన హామీలను అమలు చేయాలి. పార్టీల అధినేతలు గొప్పగా చెప్పుకున్న సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి చిత్త శుద్ధిని నిరూపించుకోవాలి. నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పారు. నూతన ప్రభుత్వం ఏర్పడి 50 రోజులు అవుతున్నా వీటి గురించి పట్టించు కున్నట్లు కనిపించడం లేదు. ఎన్నికల్లో గెలవడానికి హామీలు ఇచ్చామన్నట్లు కాకుండా ఇచ్చి న హామీలు నెరవేర్చేలా చర్యలు తీసుకోవాలి. – హైమావతి, బీఈడీ

నమ్మిన వారిని నట్టేట ముంచొద్దు



టీడీపీ ప్రభుత్వం ఎన్నికల హామీలను వంద శాతం అమలు చేయాలి. ఎన్నికల్లో గెలిచాం. ఇంక హామీల అమలుతో పనేముందనే అభిప్రాయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నట్లు తెలుస్తోంది. లక్షలాది ఉద్యోగాలు సృష్టించి ఇంటికో ఉద్యోగం ఇస్తాం, లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల ప్రచారంలో ప్ర కటిస్తే నమ్మి ఓట్లు వేశాం. నమ్మిన ఓటర్లను నట్టేట ముంచకుండా ఇచ్చిన హామీలను కచ్చితంగా అమ లు చేయాలి. నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలి. – మునిస్వామి, ఎమ్మెస్సీ, దేవనకొండ

తల్లికి వందనం ఎప్పుడిస్తారు



మాకు ఇద్దరు అబ్బాయిలు. శ్రీచైతన్య స్కూల్‌లో 5వ తరగతి, మహర్షి స్కూల్‌లో 1వ తరగతి చదువుతు న్నారు. చిరు వ్యాపారం చేస్తూ పిల్లలను చదివించుకుంటున్నాం. పాఠశాలలు పునఃప్రారంభించి రెండు నెలలు అవుతుంది. ప్రభుత్వం ఇంత వరకు తల్లికి వందనం కింద సాయం ఇవ్వలేదు. పిల్లల చదువులకు ఆర్థికంగా భారం అవుతోంది. వెంటనే ఇద్దరు పిల్లలకు రూ.30 వేలు ఇవ్వాలి. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి కింద సకాలంలో రూ.15 వేలు ఇచ్చేవారు. – వి.భారతి, విఠల్‌నగర్

మాట మారుస్తున్నారు



నేను, నా భర్త ప్రతి రోజు కూలికి పోయి వచ్చిన డబ్బులతో కుటుంబ పోషణ చూసుకుంటూనే పిల్లలను చదివించుకుంటున్నాం. కుమారుడు టౌన్ మోడల్ హైస్కూల్‌లో 9వ తరగతి, కూతురు ఏక్యాంపులోని హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అందరికీ తల్లికి వందనం కింద రూ.15 వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడేమో ఇవ్వలేమని మోసం చేస్తున్నారు. ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారు. – ఎరుకల జయలక్ష్మీ, సంతోష్‌నగర్

సూపర్ సిక్స్ కాదు.. డకౌట్

టీడీపీ హామీలు నీటిమూటలే

- అధికారం చేపట్టి 100 రోజులు దాటినా పథకాల ఊసేలేదు
- కాలయాపన చేసేందుకు అసెంబ్లీలో ఓటాన్ బడ్జెట్
- నిరుద్యోగులకు భ్రాంతిగా 'భృతి'
- కొత్త ఉద్యోగాల సంగతి దేవుడెరుగు..
- మహిళలకు నెలకు రూ.1500 సాయంపై నోరు మెదపని ప్రభుత్వం

అధికారం కోసం అడ్డదారులు తొక్కడం, మోసం చేయడం, అబద్ధాలు చెప్పడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఎలాంటి తొనుకు, బెనుకు లేకుండా 'సూపర్ సిక్స్' పేరుతో హామీలిచ్చి వాటిని అమలు చేసేందుకు నేడు తల పట్టుకు కూర్చున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూస్తుంటే భయం వేస్తోంది. ఏం చేయలన్నా, ముందుకు కదలలేక పోతున్నాం' అంటూ శాసనసభలో సాక్ష్యాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడడాన్ని చూస్తే టీడీపీ ప్రభుత్వం డకౌట్ అయినట్టేనని రాజకీయ పరిశీలకులు, మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. 2019లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం బాగోలేని సమయంలోనే అధికారం చేపట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'నవరత్నాల' పేరుతో ఐదేళ్ల పాటు నిర్విరామంగా అన్ని పథకాలను అమలు చేసిందని వారు గుర్తుచేస్తున్నారు. నాడు కేంద్ర ప్రభుత్వం అండ అంతంత మాత్రంగానే ఉన్నా ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి పథకం సజావుగా అమలైందనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

–కర్నూలు(అర్బన్)

ఆడబిడ్డ నిధిపై నోరు మెదపని ప్రభుత్వం



- నియోజకవర్గంలో సాయం పొందేందుకు అర్హులైన మహిళలు - 1,14,657
- మహిళలందరికీ ఒక నెలకు ప్రభుత్వం అందించాల్సిన మొత్తం - రూ.17.19 కోట్లు
- ఏడాది పాటు పథకాన్ని నిలిపివేస్తే కలిగే నష్టం - రూ.216.38 కోట్లు



నవరత్నాలు

వైఎస్సార్‌సీపీ పాలనలో అమ్మ ఒడి పథకం కింద అందించిన సాయం

- మొత్తం లబ్ధిదారులు - 46000
- నాలుగేళ్లలో అందించిన సాయం - రూ.235.84 కోట్లు

ఏడాది దాటవేత దిశగా తల్లికి వందనం



- కర్నూలు అర్బన్ పరిధిలోని మొత్తం పాఠశాలలు - 433
- 1 నుంచి 10వ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులు - 75000
- ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున విద్యార్థులకు అందించాల్సిన మొత్తం - రూ.112.50 కోట్లు

నిరుద్యోగ భృతికి ఎదురుచూపులు



- కర్నూలు అర్బన్ పరిధిలోని నిరుద్యోగులు - 58,642
- ఒక్కొక్కరికి నెలకు అందించాల్సిన భృతి - రూ.3 వేలు
- నిరుద్యోగులందరికీ నెలకు అందించాల్సిన మొత్తం - రూ.35.10 కోట్లు
- ఏడాది పాటు పథకాన్ని నిలిపివేస్తే కలిగే నష్టం - రూ.421.20 కోట్లు

భవిష్యత్తు గ్యారెంటీ అని చెప్పి మోసం



ఎన్నికల ముందు టీడీపీ నాయకులు వచ్చి భవిష్యత్తుకు గ్యారెంటీ అన్నారు. నమ్మాం. ఇప్పుడేమో హామీలను అమలుచేయకుండా జాప్యం చేస్తున్నారు. గత ప్రభుత్వం వైఎస్సార్ చేయూత క్రమంగా ఐదేళ్ల పాటు ఇచ్చింది. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలను పట్టించుకోవడం లేదు. ప్రతి నెల రూ.1500 ప్రకారం ఇస్తామన్నారు. ఎప్పుడు ఇస్తారో కూడా తెలియని పరిస్థితి. – బి. పద్మావతి, ఆరోరానగర్

ఆడబిడ్డ నిధి ఇంకెప్పుడు..



ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకు నెలకు రూ. 1500 ఇస్తామన్నారు. ఇప్పుడు ఆ ఊసే లేదు. మా ఇంట్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. ప్రతి నెలా రూ.3 వేలు ఇవ్వాలి. చెప్పిన మాట ప్రకారం పథకం అమలుచేస్తే అవసరాలు తీరుతాయని ఆశపడ్డాం.ప్రభుత్వం జాప్యం చేయడం తగదు. – ఆశాలత వెంకటరమణ కాలనీ

క్లుప్తంగా

సీఎం సహాయ నిధికి రూ.40 వేల విరాళం



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న హుసేనాపురం సోల్జర్స్ అసోసియేషన్ సభ్యులు

కర్నూలు(సెంట్రల్): సీఎం సహాయనిధికి హుసేనాపురం సోల్జర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.40 వేల విరాళాన్ని ప్రకటించారు. బుధవారం విరాళానికి సంబంధించిన చెక్కును కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు ఆయన కార్యాలయంలో అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి హుసేనాపురం సోల్జర్స్ అసోసియేషన్ ముందుకు రావడం అభినందనీయమని, వీరి స్ఫూర్తితో యువత ముందుకొచ్చి సహాయ, సహకారాలు అందించాలని సూచించారు.

కొడుకుపై బెంగతో ఇంటి నుంచి వెళ్లిపోయిన తండ్రి



మద్దిలేటి(ఫైల్)

కర్నూలు: కనిపించకుండా పోయిన కుమారుడు ఏడాదైనా తిరిగి రాలేదనే బెంగతో తండ్రి కూడా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. స్థానిక పాత బస్తీలోని చిత్తారి వీధిలో నివాసముంటున్న కురువ మద్దిలేటి(45)కి కుమారుడు దీపక్, కూతురు స్వాతి ఉన్నారు. దీపక్ బీటెక్ రెండో సంవత్సరం చదువుతూ ఏడాది క్రితం ఇంట్లో నుంచి కనిపించకుండా పోయాడు. కొడుకుపై బెంగతో మంగళవారం ఉదయం పనికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిన మద్దిలేటి సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో తెలిసిన చోటల్లా వెదికారు. ఆచూకీ లేకపోవడంతో భార్య మహేశ్వరి బుధవారం ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తా

- బాధ్యతలు స్వీకరించిన నూతన కమిషనర్ రవీంద్రబాబు



కర్నూలు (టౌన్): కర్నూలు కార్పొరేషన్ కమిషనర్‌గా 2015, 2019లో రెండు దఫాలుగా పనిచేసిన అనుభవంతో మరింత అభివృద్ధికి కృషి చేస్తానని నగరపాలక నూతన కమిషనర్ రవీంద్రబాబు తెలిపారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించి, జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరిచేందుకు, నగరం గుండా వెళ్తున్న రెండు నదులతోపాటు కేసీ కెనాల్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తానన్నారు. కమిషనర్‌ను నగరపాలక మేనేజర్ చిన్నరాముడు, అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు కలిసి అభినందనలు తెలియజేశారు.

పెద్దాసుపత్రికి ఎక్స్‌రే డిజిటల్ క్యాసెట్ల విరాళం



సూపరింటెండెంట్‌కు క్యాసెట్లు అందిస్తున్న రేడియాలజీ విభాగం పూర్వ వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రేడియాలజీ విభాగం పూర్వ వైద్యులు ఫ్యూజీ కంపెనీకి చెందిన ఐదు ఎక్స్‌రే డిజిటల్ క్యాసెట్లు విరాళంగా ఇచ్చారు. బుధవారం వీటిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేడియాలజీ విభాగంలో క్యాసెట్ల కొరత ఉందని పూర్వ వైద్యుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి రూ.2.50 లక్షల విలువ చేసే క్యాసెట్లను విరాళమివ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రేడియాలజీ హెచ్ఓడీ డాక్టర్ పద్మలత, ప్రొఫెసర్ డాక్టర్ రాధారాణి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హరినాథ్, రేడియాలజీ విభాగం పూర్వ వైద్యులు జోజిరెడ్డి, సురేష్, విజయ్‌కుమార్, రవికుమార్, సుమన్, మహేష్‌యాదవ్, అశోక్, రవితేజ, హనీఫ్, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

డాక్టర్ వెంకటరమణకు పదోన్నతి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏఆర్ఎంఓగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకటరమణకు డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆయనకు కర్నూలు మెడికల్ కాలేజీలోని ఎస్‌పీఎం విభాగంలో పోస్టింగ్ ఇచ్చారు.

ఎంబీబీఎస్ సీట్లను భర్తీ చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఆదోని, మార్కాపురం, పులివెందుల, మదనపల్లె, పాడేరు మెడికల్ కళాశాలల్లో మెడికల్ సీట్లను భర్తీ చేయాలని ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర నగర కార్యదర్శి మల్లేష్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత సంవత్సరం 750 సీట్లను కొత్త కళాశాలల్లో భర్తీ చేశారని, ఈ సంవత్సరం కూడా మరో 750 సీట్లను భర్తీ చేయాల్సి ఉన్నా మౌలిక వసతులు లేవని వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వం పేర్కొనడం హాస్యాస్పదమన్నారు.

ఇరుకు దారి సరిచేశారు



వినాయక ఘాట్ వద్ద రోడ్డును విస్తరించి సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కర్నూలు: ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు పలు చర్యలు చేపడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్రమాదాలు, మరికొన్ని ప్రాంతాల్లో ప్రమాదాలకు కారణమవుతున్న పలు అంశాలను గుర్తించారు. రహదారి విస్తరణ, రిపేర్లకు సంబంధించి మున్సిపల్ అధికారులతో సంప్రదించి విస్తరణ పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా వినాయకఘాట్ రోడ్డుపై నిత్యం ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో బుధవారం విశాలం చేశారు. ఇక్కడ ఆలయం ఉండటంతో పండుగల సమయంలో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండేది. ఆలయం పక్కన తోపుడు బండ్లు, చిరు వ్యాపారులు కమ్మేయడం, ఆటోలు, ఇతర వాహనదారులు ఆలయం పక్కన రోడ్డుపైనే పార్క్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. ఒకవైపు రోడ్డు వెడల్పుగా.. గుడివైపు రోడ్డు ఇరుకుగా ఉండటంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. డివైడర్ కోసం ఏర్పాటు చేసిన శాశ్విత దిమ్మెను పగలగొట్టి కొద్దిగా రోడ్డు వెడల్పు అయ్యేలా నిర్మాణ పనుల్లో మార్పు చేశారు. ఇందుకోసం తాత్కాలికంగా సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేశారు.

ట్రాఫిక్ మొబైల్ పోలీసులకు రేడియం జాకెట్లు, సైరన్లు



ట్రాఫిక్ మొబైల్స్ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్పీ

కర్నూలు: నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు మొబైల్ విధులు నిర్వహించే సిబ్బందికి రేడియం జాకెట్లు, సైరన్లను అందజేశారు. బుధవారం మధ్యాహ్నం కొండారెడ్డి బురుజు వద్ద ఎస్పీ బిందుమాధవ్ చేతుల మీదుగా రేడియం జాకెట్లు, సైరన్లను ట్రాఫిక్ సిబ్బందికి అందజేసి మొబైల్స్ వాహనాలను జెండా ఊపి ఎస్పీ ప్రారంభించారు. 14 ట్రాఫిక్ మొబైల్స్ వాహనాలకు సైరన్లు, రేడియం జాకెట్లు అందజేసినట్లు ఎస్పీ తెలియజేశారు. పొగ కాలుష్యంతో ట్రాఫిక్ విధులు నిర్వహించేవారికి గొంతు ఇన్ఫెక్షన్ రాకుండా ఉండేందుకు ఒక్కొక్కరికి కేజీ బెల్లం కూడా ఇచ్చారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని బళ్లారి చౌరస్తాలో హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు సాఫీగా వెళ్లేందుకు స్టాపర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీఐలు మన్సురుద్దీన్, రామయ్య నాయుడు, శ్రీరాం, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ మహమ్మద్ హుసేన్, ట్రాఫిక్ పోలీసులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక బాధ్యులు శివశంకర్ గౌడ్

కర్నూలు కల్చరల్: పర్యావరణ పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని జనవిజ్ఞాన వేదిక బాధ్యులు శివశంకర్ గౌడ్ అన్నారు. రాయలసీమ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం పర్యావరణ పరిశుభ్రత, శాస్త్రవిజ్ఞానంపై జేవీవీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. జేవీవీ బాధ్యులు శివశంకర్ గౌడ్, శేషాద్రిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మన్సూర్ బాషా మాట్లాడుతూ కోట్లాది ఎకరాల అటవీ భూములను అభివృద్ధి పేరుతో ధ్వంసం చేస్తున్న కారణంగా జీవ వైవిధ్యానికి, వృక్ష జంతు జల సంరక్షణకు తీరని నష్టం జరుగుతోందన్నారు. ప్రకృతి ప్రకోపానికి గురికావాల్సిందేనని హెచ్చరించారు. వైజ్ఞానికి దృక్పథాన్ని పెంపొందించడం కోసం కృషి చేసే ఆసక్తి ఉన్నవారు 9440293703 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ పి.నాగరాజు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాద్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీలు లక్ష్యాలను సాధించాలి

కర్నూలు (అగ్రికల్చర్) : ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీలు 2024–25 సంవత్సరానికి సంబంధించి వంద శాతం లక్ష్యాలను సాధించాలని మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు సెక్రటరీలను ఆదేశించారు. బుధవారం మార్కెట్ యార్డులోని అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 15 మార్కెట్ కమిటీల సెక్రటరీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్నూలు ఏడీఎం నారాయణమూర్తి, ఆదోని ఏడీఎం రెహమాన్, కర్నూలు మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిగ్రస్తులకు పాదరక్షల పంపిణీ



పాదరక్షలు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్. భాస్కర్, అధికారులు

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆదర్శ లెప్రసీ కాలనీలో కుష్టువ్యాధిగ్రస్తులకు పాదరక్షలను (మైక్రో సెల్యులర్ రబ్బర్ చెప్పులు) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ మాట్లాడుతూ సాధారణంగా కుష్టువ్యాధిగ్రస్తులకు స్పర్శ లేకపోవడం వల్ల వేడి తగిలినా, ముల్లు గుచ్చుకున్నా పాదాలకు గాయాలు అయ్యే అవకాశం ఉందన్నారు. అందువల్ల పాదాలకు రక్షణగా ఎంసీఆర్ చెప్పులను ఉచితంగా పంపిణీ చేసి, వాటిని వారు క్రమం తప్పక వాడేటట్లు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో టీహెచ్ వార్డు వైద్యాధికారి డాక్టర్ శ్రీదేవి, యూపీహెచ్‌సీ వీకర్ సెక్షన్ కాలనీ వైద్యాధికారి డాక్టర్ శ్రీరాములు, ఫిజియోథెరపిస్ట్ రెడ్డిబాబు, డీపీఎంఓ నారాయణరావు, సుబ్రహ్మణ్యం, ప్రకాష్ పాల్గొన్నారు.

వినాయక కడ్డీల కోసం వెళ్లి వ్యక్తి మృతి

కర్నూలు: కేసీ కెనాల్‌లో వినాయక విగ్రహాలకు ఉన్న ఇనుప కడ్డీలను తెచ్చుకోవడానికి వెళ్లి బిర్లా గడ్డలో నివాసముంటున్న బోయ భీముడు (40) నీటిలో కొట్టుకుపోయి మృతిచెందాడు. ఈయన సెంట్రింగ్ పని చేస్తూ జీవనం సాగించేవాడు. 15వ తేదీన గణేష్ నిమజ్జన వేడుకలు జరిగాయి. 16వ తేదీ ఉదయం కెనాల్‌లో విగ్రహాలకు ఉన్న ఇనుప కడ్డీలు తెచ్చుకోవడానికి వెళ్తున్నట్లు చెప్పి తిరిగి రాకపోవడంతో భార్య వరలక్ష్మితో పాటు కుటుంబ సభ్యులు కేసీ కెనాల్ వెంట వెతుకుతుండగా బుధవారం సాయంత్రం జొహరాపురం బ్రిడ్జి సమీపంలో కేసీ కెనాల్ మెట్ల వద్ద నీటిలో తేలియాడుతూ కనిపించాడు. భార్య వరలక్ష్మి మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

అర్చకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానం

కర్నూలు (కల్చరల్) : జిల్లాలో వేద విద్యను అభ్యసించి నిరుద్యోగులుగా ఉన్న పేద అర్చకుల నుంచి నిరుద్యోగ భృతికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దేవదాయ శాఖ సహాయ కమిషనర్ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరుద్యోగ భృతిగా నెలకు రూ.3 వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన నిరుద్యోగులు వారి వివరాలతో కూడిన దరఖాస్తులను కర్నూలు మద్దూర్‌నగర్‌లోని జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయానికి పంపాలని తెలిపారు.

క్రీడలకు సమయం కేటాయించండి

కర్నూలు (టౌన్): ప్రతి రోజు కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు విద్యార్థులకు సూచించారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఏర్పాటు చేసిన అండర్–19 టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ అండర్–19 జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్, వ్యాయామ ఉపాధ్యాయులు శేషు, కిరణ్, నరసప్ప పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోల్లో 'స్వచ్ఛతా హీ సేవ' నిర్వహించాలి

కర్నూలు సిటీ: జిల్లాలోని అన్ని ఆర్టీసీ డిపోల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా ప్రజా రవాణా శాఖ పర్సనల్ ఆఫీసర్ బి.సర్దార్ హుస్సేన్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం డ్రైనేజీని శుభ్ర పరచడం, బూజు దులపడం, కుర్చీలకు రంగులు వేయడంతోపాటు పారిశుధ్య కార్మికులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డిపోలో అక్టోబర్ 1 వరకు కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

కార్మికుల సంక్షేమమే ప్రధాన ఎజెండా

- 9 తీర్మానాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం



ఎజెండా అంశాలను చర్చిస్తున్న మేయర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా నగరపాలక స్థాయి సంఘం పనిచేస్తున్నట్లు నగర మేయర్ బీవై.రామయ్య తెలిపారు. బుధవారం మేయర్ బీవై రామయ్య తన చాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు విక్రమసింహారెడ్డి, క్రాంతికుమార్, జుబేర్, షేక్ యూనూస్‌బాషా, మిద్దె చిట్టెమ్మ హాజరయ్యారు. సమావేశంలో 9 ఎజెండా అంశాలను చర్చించి ఆమోదం తెలిపారు.

తీర్మానాలు ఇవే..

- కింగ్ మార్కెట్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 25 ఏళ్లపాటు లీజు కాలం పూర్తయిన షాపు నెంబర్ 52/150–పి, ఖాళీ చేసిన 52–150–ఈ షాపులను బహిరంగ వేలం నిర్వహించేందుకు ఆమోదం.
- నగరపాలక సంస్థ కార్పొరేటర్లకు, అధికారులకు, సిబ్బందికి, రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఆరోగ్య భద్రతా దృష్టిలో ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షల బీమా వర్తించేలా ఆరోగ్య బీమా ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు లిమిటెడ్ వారికి రూ.520 చొప్పున చెల్లించేందుకు ఆమోదం.
- నగరంలో పనిచేస్తున్న 1,155 మంది శాశ్వత, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులకు ప్రతినెలా 350 గ్రాముల పారాషూట్ నూనె, డిటర్జెంట్ సబ్బులు, ఏడాది కాలం పాటు పంపిణీ చేసేందుకు అయ్యే రూ.22.50 లక్షలను మంజూరు చేస్తూ ఆమోదం.
- నాలుగవ తరగతి ఉద్యోగులకు రెండు జతల దుస్తులు, చెప్పులు, టవల్స్, మహిళలకు 3 చీరెలు, 3 రవికెలు, 3 టవల్స్ పంపిణీ చేసేందుకు లేపాక్షి హ్యాండీ క్రాఫ్ట్ ఎంపోరియమ్‌కు రూ.23 లక్షలను కేటాయింపు.
- ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.40 లక్షలు కేటాయింపు.
- విద్యుత్ దీపాల మరమ్మతులు, సిబ్బందిని మరో ఏడాది పాటు కొనసాగించేందుకు రూ.38 లక్షలు మంజూరు.
- క్లాప్ ఆటో డ్రైవర్ల వేతన బకాయిలు చెల్లించేందుకు సాధారణ నిధుల నుంచి రూ.43.68 లక్షల మంజూరుకు ఆమోదం.

కానిస్టేబుల్ అభ్యర్థులకు ఫిజికల్ టెస్టులు నిర్వహించాలి



కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు

కర్నూలు(సెంట్రల్): పోలీసు కానిస్టేబుల్–2022 నోటిఫికేషన్‌లో భాగంగా భర్తీ చేయాల్సిన పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు వెంటనే ఫిజికల్ టెస్టులు నిర్వహించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. బుధవారం జెడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు నిరుద్యోగులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై.నగేష్ మాట్లాడుతూ 2022లో రాష్ట్ర ప్రభుత్వం 6,100 పోలీసు కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్‌ను విడుదల చేసిందన్నారు. ఇందులో హోంగార్డులకు రిజర్వేషన్ శాతాన్ని పెంచడంతో కొందరు అభ్యర్థులు సుప్రీంకోర్టుకు వెళ్లారన్నారు. ఆ కేసును పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం స్పందించడం లేదన్నారు. కోర్టులో ఒక్క హియరింగ్‌కు కూడా హాజరు కావడం లేదన్నారు. ఈక్రమంలో ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఫిజికల్ ఈవెంట్స్, మెయిన్ పరీక్ష కోసం ఎదురు చూస్తున్నారన్నారు. గతంలో నారా లోకేష్ తన పాదయాత్రలో 100 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చారని, ఇప్పుడు ఆ విషయంపై మాట్లాడకపోవడం తగదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగప్ప, హుస్సేన్‌బాషా, సాయి, ఉదయ్, అర్యన్, ఖాజాబాషా పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర



మాట్లాడుతున్న ఎస్.షాబీర్‌బాషా

కర్నూలు(సెంట్రల్): అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర చేస్తోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.షాబీర్‌బాషా విమర్శించారు. ఎన్ఎంసీ అనుమతులు ఇచ్చిన కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించలేమని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడం సిగ్గు చేటన్నారు. బుధవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు వైద్య కళాశాలలను గుజరాత్ తరహాలో పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్ విధానంలో నిర్మించాలని నిర్ణయించడం దారుణమన్నారు. భవిష్యత్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను తొలగించేందుకు కుట్ర జరుగుతోందన్నారు. రాష్ట్రంలో ఉన్న 37 మెడికల్ కళాశాలల్లో కేవలం 6 మాత్రమే ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయని, మిగిలిన వాటిని ప్రైవేట్ పరం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. తక్షణమే ప్రైవేట్ పరం చేసేందుకు విడుదల చేసిన 107, 108 జీఓలను రద్దు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సోమన్న, నాయకులు మధు, రాము, అఖిల్, దినేష్, సుధీర్, వీరేష్ పాల్గొన్నారు.

కల్లకుంట ఘటనపై కేసు నమోదు చేయాలి



కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతిపత్రం ఇస్తున్న కేవీపీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): పెద్దకడబూరు మండలం కల్లకుంటలో దళిత గోవిందమ్మపై కొనసాగిన ఘటనను సుమోటోగా కేసు నమోదు చేసి నిందితులపై అరెస్టు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్రా మల్యాద్రి డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మల్యాద్రి మాట్లాడుతూ గురజాల గ్రామంలో దళితులను గ్రామ బహిష్కరణ చేసిన ఘటన మరవక ముందే కల్లకుంటలో దళిత మహిళను బట్టలు ఊడదీసి, చెట్టుకు కట్టేసి కొట్టిన ఘటన చోటుచేసుకోవడం దారుణమన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు సమయస్ఫూర్తితో స్పందించకపోవడంతోనే ఘటనలు పునరావృతమవుతున్నాయన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.దేవసహాయం, ఎండీ ఆనందబాబు ఉన్నారు.